క్లుప్తంగా

గాదిలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



హాలహర్వి: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గూళ్యం గ్రామంలోని గాదిలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. ఆంధ్ర నుంచే గాక కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయంలో అన్నదానం చేశారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కల ప్రాధాన్యత వివరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ

పత్తికొండ రూరల్ : మొక్కల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అన్నారు. గురువారం పత్తికొండలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఆవరణలో అసెంబ్లీ కో–కన్వీనర్ గోవర్ధన్ ఆధ్వర్యంలో హాస్టల్ వార్డెన్ నాగరాజుతో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ అమ్మకోసం ఒక మొక్క అనే నినాదంతో ప్రతి విద్యార్థి మొక్కను అమ్మలా చూసుకోవాలని సూచించారు. బీజేవైఎం జిల్లా కన్వీనర్ కరణం నరేష్, ఏబీవీపీ జిల్లా మాజీ కో–కన్వీనర్ సోమన్న, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండి మల్లికార్జున, కిసాన్ మోర్చా అసెంబ్లీ ఇన్‌చార్జ్ సిసి.రంగన్న పాల్గొన్నారు.

భూసర్వే అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామంలో చేపట్టిన భూ సర్వేలో అవకతవకలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు శివానంద, రైతులు జోగి రంగప్ప, శ్రీరాములు డిమాండ్ చేశారు. వారు గురువారం ఆస్పరిలో మాట్లాడుతూ.. కారుమంచి గ్రామంలో చేపట్టిన భూసర్వేలో సర్వే నంబర్లు, రైతుల పేర్లు తారుమారు కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేలో అవకతవకలకు పాల్పడిన డీటీ, వీఆర్‌ఓ, సర్వేయర్లు, వీఆర్‌ఏలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. భూ సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 23వ తేదీన ఆస్పరి అంబేడ్కర్ సర్కిల్లో రైతులతో కలిసి నిరాహార దీక్షలు చేపడతామని స్పష్టం చేశారు.

కేజీబీవీలో నాణ్యత లేని భోజనం

దేవనకొండ: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారని డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాసిరకం భోజనం అందిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యతలేని భోజనం తినడం వల్ల విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం వైపు నుంచి అనేక రకాల వస్తువులు వస్తున్నా సిబ్బంది నిర్లక్ష్యం, అవినీతి వల్ల విద్యార్థినులకు సరైన భోజనం అందడం లేదన్నారు. విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. డీవైఎఫ్‌ఐ నాయకులు చిన్నవీరేంద్ర, మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మన్యం వీరుడికి నివాళి



బిల్లేకల్లులో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లులో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నాయకులు అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆ సంఘం నాయకులు రమేష్, లక్ష్మన్న, రంగస్వామి, చందు, వినోద్, శ్రీను పాల్గొన్నారు.

నేడు సంపూర్ణత అభియాన్ సమావేశం

మద్దికెర : స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో శుక్రవారం ఉదయం 9:30 గంటలకు సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ గురువారం తెలిపారు. కార్యక్రమములో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి పాల్గొంటారన్నారు. మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవ్వాలని కోరారు.

ప్రభుత్వ పథకాలతో ఉన్నతంగా ఎదగాలి



హొళగుంద బస్టాండులో విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసిన దృశ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీ సీఈఓ, జిల్లా అధికారులు

హొళగుంద: ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పిలుపునిచ్చారు. హొళగుందలో గురువారం కేంద్ర ప్రభుత్వ సంస్థ నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన సంపూర్ణత అభియాన్ (ఆస్పిరేషన్ బ్లాక్స్) కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. సర్పంచ్ చలవాది రంగమ్మ అధ్యక్షతన జెడ్పీ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ, ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీతో పాటు జిల్లా ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించి బస్టాండులో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, అధికారుల చేత ఎంపీడీఓ ఆజాద్ కార్యక్రమానికి సంబంధించిన అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. అలాగే పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య, ఐసీడీఎస్ తదితర శాఖలకు సంబంధించి స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ.. వెనుకబడిన ప్రాంతాల్లో గర్భిణుల యాంటీనేటల్ రిజిస్ట్రేషన్, ఐసీడీఎస్ పథకం కింద పౌష్టికాహార పదార్థాలు తీసుకుంటున్న గర్భిణులు, వారికి ఆరోగ్య పరీక్షలు, రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యుల బలోపేతం, డిజిటల్ సేవలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడం లాంటివి పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. సీపీఓ హిమ ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ.. నీతి ఆయోగ్ సంస్థ నిర్వహించిన సంపూర్ణత అభియాన్ 39 అంశాలలో ప్రధానంగా విద్య, వైద్యం, ఆరోగ్యం, పౌష్టికాహారం, సాధికారత, వ్యవసాయం, డిజిటల్ సేవల రంగాలలో ఈ నెల 4 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు వంద శాతం కార్యక్రమాలు పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించి ఆర్థిక, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అందించడమే లక్ష్యమన్నారు. డీఆర్‌డీఓ పీడీ సలీంబాషా, పశు సంవర్ధక శాఖ జేడీ శ్రీనివాసులు, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, డీటీ నిజాముద్దీన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్

కృష్ణగిరి: పత్తికొండ నియోజకవర్గంలో తమ సొంత మండలమైన కృష్ణగిరిని అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ బోయ సుశీల అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మా కుటుంబానికి ఓనమాలు నేర్పిన కృష్ణగిరిని నియోజకవర్గంలో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలను బలోపేతం చేస్తామని చెప్పారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రహదారులను బాగు చేస్తామన్నారు. పలువురు సర్పంచ్‌లు సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అతిసార వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. రైతులకు పొద్దుతిరుగుడు విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, తహసీల్దార్ అనురాధ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. సర్వసభ్య సమావేశం దృష్ట్యా పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎస్‌ఐ బదిలీ

తుగ్గలి : మండల పరిధిలోని జొన్నగిరి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రామాంజనేయులు కర్నూలుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు పోలీసుస్టేషన్‌లో గురువారం పోలీసు సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు ఎస్‌ఐను పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.

నేడు రేషన్ డీలర్ల సమావేశం

ఆలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు అన్ని గ్రామాలకు చెందిన రేషన్‌షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు డీటీ రజనీకాంత్ రెడ్డి గురువారం తెలిపారు. అదేవిధంగా రేషన్ పంపిణీ వాహనదారులు కూడా సమావేశానికి హాజరుకావాలన్నారు.

ఆర్థిక సాయం

పత్తికొండ రూరల్ : మండలంలోని దూదేకొండ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన ధనుంజయగౌడ్ కుటుంబానికి పోచిమిరెడ్డి సేవాదళ్ వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.మురళీధర్‌రెడ్డి గురువారం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. సేవాదళ్ ప్రతినిధి రాయుడు నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

ప్రధానోపాధ్యాయుడు సస్పెన్షన్

కౌతాళం: మండల పరిధిలోని వల్లూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సస్పెండ్ చేస్తూ డీఈఓ శ్యాముల్ ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈఓ శోభారాణి తెలిపారు. ఆమె గురువారం మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో గ్రామస్తులు ఇటీవల డీఈఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు నివేదికను డీఈఓకు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు రుజువు కావడంతో సస్పెండ్ చేస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈఓ తెలిపారు.

టీబీ డ్యాంకు మరింత పెరిగిన ఇన్‌ఫ్లో



టీబీ డ్యాంలో ఎగిసి పడుతున్న నీటి కెరటాలు

- 12 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ
- డ్యాం ఎగువ భాగంలో ఆశాజనకంగా వర్షాలు

హొళగుంద: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర డ్యాంకు వరద మరింత పెరిగింది. బుధవారం 10 వేల క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో గురువారం 17,750 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి మట్టానికి గాను 12 టీఎంసీల వరకు నీరు నిల్వ అయ్యాయి. అవుట్ ఫ్లో 273 క్యూసెక్కులుండగా 1633 అడుగుల డ్యాం ఎత్తుకు గాను 1588.84 అడుగుల వరకు నీరు చేరాయి. ఇన్నాళ్లు నిరాశ కలిగించిన ఇన్‌ఫ్లో కొద్ది రోజులుగా వేగం పుంజుకుంటుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. శివమొగ్గ, తీర్థనహళ్లీ, చిక మంగళూరు, వరనాడు, శృంగేరి తదితర డ్యాం ఎగువ భాగంలోని ప్రాంతాల్లో బాగానే వర్షాలు కురుస్తుండడంతో నీటి చేరిక పెరుగుతోంది. దీంతో కర్ణాటక, ఆంధ్రాకు సంబంధించి దిగువ కాలువ (ఎల్లెల్సీ) ఆయకట్టు రైతులు వరుణుడి కరుణించి తొందరగా రిజర్వాయర్ నిండాలని మొక్కుకుంటున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి



ఈఓపీఆర్డీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

దేవనకొండ: గత వేసవిలో పనిచేసిన ఉపాధి హామీ పనులకు సంబంధించి వేతనాలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బి.వీరశేఖర్ మాట్లాడుతూ.. మండలంలో ఆరు నుంచి ఏడు వారాల ఉపాధి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎర్రటి ఎండలో కష్టం చేసినా వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం కూలీలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు.అలాగే ప్రతి కూలీకి 200 రోజులు పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు అశోక్, శ్రీనివాసులు, వీరేంద్ర, మురళీ, రాఘవేంద్ర, రామాంజనేయులు, మస్తాన్, రవి తదితరులు ఉన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి



ములుగుందంలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

ఆస్పరి: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ అమలు చేసి మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, జిల్లా కార్యదర్శులు దేవపాల్, నరసింహులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని ములుగుందం, పలకూరబండ, బనవనూరు, కారుమంచి, కైరుప్పల, బిల్లేకల్లు, ఆస్పరి, జొహరాపురం, చిన్నహోతూరు గ్రామాలలోని పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 11వ పీఆర్సీ, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. యూటీఎఫ్ నాయకులు రంగన్న, బాబు, కృష్ణమూర్తి, మోదీన్ బాష, ఖలీల్, సుధాకర్, చంద్రపాల్ పాల్గొన్నారు.

దర్గాకు తరలివచ్చిన భక్తులు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. దీంతో దర్గా పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు. భక్తులకు ధర్మకర్త అన్నదానం ఏర్పాటు చేశారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు



చౌకదుకాణాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రామలక్ష్మి

చిప్పగిరి: రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ ఎన్.రామలక్ష్మి హెచ్చరించారు. మండలంలోని ఏరూరు, బెల్డోణ, చిప్పగిరి గ్రామాల్లోని వివిధ రేషన్ షాపులపై ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదులు చేయడంతో గురువారం ఆర్డీఓ విచారణ చేపట్టారు. మండలంలోని రేషన్ డీలర్లు, ఎమ్‌డీయూ ఆపరేటర్లను పిలిపించి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏరూరు గ్రామంలోని రెడ్డి పద్మ షాప్ నంబర్ 20పై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమగ్ర విచారణకు ఆస్పరిలో డీటీగా విధులు నిర్వర్తిస్తున్న భీమేష్‌ను నెల రోజుల పాటు చిప్పగిరికి నియమించినట్లు చెప్పారు. నివేదిక ఆనంతరం తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డీటీ ఇజాజ్ అహమ్మద్, సీనియర్ అసిస్టెంట్ మధుస్వామి, వీఆర్‌ఓలు మల్లికార్జున, చంద్రనాయక్ తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ

పత్తికొండ రూరల్ : పట్టణంలోని పలు ప్రభుత్వ రేషన్ షాపులను ఆర్డీఓ నీలపు రామలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. షాపుల్లోని బియ్యం నిల్వలు, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం ఎండీయూ వాహనాల ద్వారా జరుగుతున్న పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా సమస్య తలెత్తకుండా వినియోగదారులకు సక్రమంగా రేషన్ అందించాలని నిర్వాహకులకు సూచించారు. తహసీల్దారు మాధవరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది,



ఆలూరులో అవగాహన పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

మద్దికెర : డెంగీ వ్యాధిపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ వైద్యాధికారులు రాగిణి తెలిపారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, జ్వరం వచ్చిన వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రక్తపరీక్షలు చేయించుకొని మందులు వాడాలని సూచించారు. హాస్టల్ పరిధిలో పరిసరాల శుభ్రత, నీటి నిల్వలు, వాటర్ ట్యాంకుల పైన ఉన్న మూతలను, కిటీకులకున్న మెష్‌లు, వాష్ రూంలను వంటశాలలను పరిశీలించి పలు సూచనలు చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా, ప్రిన్సిపాల్ సవిత, ఏఎన్‌ఎం అంజలి పాల్గొన్నారు.

డెంగీని నిర్మూలిద్దాం

ఆలూరు రూరల్: డెంగీ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి అన్నారు. గురువారం ఆలూరులో డెంగీ నిర్మూలన పోస్టర్లను విడుదల చేశారు. దోమలు ప్రబలకుండా ప్రతిఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలు వాడాలన్నారు. రోజు విడిచి రోజు జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పుల వంటి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవాలని సూచించారు.

రమణీయం.. విజయీంద్రతీర్థుల రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న చిన్నారులు, భక్తులు

హొళగుంద: స్థానిక కోటవీధిలో వెలసిన విజయీంద్రతీర్థుల రథోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. విజయీంద్రతీర్థుల 410వ మహా ఆరాధనోత్సవాల ముగింపులో భాగంగా జరిగిన ఉత్తరాధన కార్యక్రమం సందర్భంగా రాఘవేంద్ర స్వామి, విజయీంద్రతీర్థుల మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు జరిగాయి. సోమవారం పూర్వారాధన, మంగళవారం ఏకాదశి, బుధవారం మధ్యారాధన పూజలు చేసిన బ్రాహ్మణులు గురువారం ఉత్తరాధన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఉదయం మూలవిరాటల్‌కు పంచామృతభిషేకం చేసి నిర్మల్య విసర్జన, సుప్రభాత సేవ, పవనామహోమం, తులసి అర్చన పూజలనంతరం గ్రామ పురవీధుల్లో రథోత్సవాన్ని భకిత్శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భజన స్వస్తి వాచన, మహా నైవేద్య, తీర్థ ప్రసాద కార్యక్రమాలతో పాటు ఆరాధానోత్సవ కార్యక్రమాలు ముగిశాయి. విజయీంద్రతీర్థులు మంత్రాలయం రాఘవేంద్రస్వామికి గురువుగా బ్రాహ్మణులు చెప్పారు. తమిళనాడులోని కుంభమేళా తర్వాత హొళగుందలో మాత్రమే గురుశిష్యుల ఆలయం ఉన్నట్లు వారు తెలిపారు. కార్యక్రమానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం





ఆలూరులో విద్యా సంస్థల బంద్ అనంతరం మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు, హొళగుందలో బంద్‌లో పాల్గొన్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ఆలూరు రూరల్: నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైనట్లు వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నీట్‌ను మళ్లీ నిర్వహించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రికి మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. నీట్ పేపర్ లీకేజీకి కారణమైన ఎన్డీఏ ప్రభుత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పరీక్ష రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. జాతీయ నూతన విద్యావిధానం పేరుతో ఈ–పాఠశాలలను మూసివేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. జాతీయ విద్యా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నీట్ పరీక్షను రాష్ట్రాలకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. బంద్‌కు సహకరించిన పాఠశాల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకులు గోవర్ధన్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు గిరి మూర్తి, పీడీఎస్‌యూ అధ్యక్షులు దుర్గా ప్రసాద్ విద్యార్థి సంఘం నాయకులు శివరాజ్, రవి,వినోద్, బసవ,శంకర్ అశోక్, మధు తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: నీట్ అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి, ఇటీవల జరిగిన పరిణామాలు తదితర వాటికి సంబంధించి గురువారం దేశవ్యాప్తంగా తలపెట్టిన విద్యా సంస్థల బంద్ హొళగుందలో ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల కార్యదర్శి సతీష్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను ఉన్నత వర్గాల వారి కోసం అనే విధంగా మార్చిందన్నారు. నీట్ పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నేతలపై అక్రమ కేసులు వెనక్కి తీసుకోవాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజేష్, మల్లయ్య, రాజు, అజయ్ , మంజు తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేవనకొండలో గురువారం చేపట్టిన బంద్ విజయవంతమయ్యింది. ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నీట్, నెట్ పరీక్షల లీకేజీపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యాసంస్థలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాహక్కులను కాలరాస్తోందన్నారు. రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసేవిధంగా వ్యవహరిస్తోందన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించి నీట్, నెట్ ప్రశ్నపత్రాల లీక్‌కు బాధ్యులైన ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలన్నారు. అలాగే దేశవ్యాప్తంగా పాఠశాలల మూసివేత ఆపాలని, యూనివర్సిటీ కేంద్రాల్లో విద్యార్థులపై అక్రమ కేసులు ఆపాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మహబూబ్‌బాషా, డీవైఎఫ్‌ఐ నాయకులు చిన్నవీరేంద్రనాయుడు, ఏఐఎస్‌ఎఫ్ మండల నాయకులు మధు, మురళీ, రాకేష్, వేణు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



దేవనకొండలో జెడ్పీ పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



వెల్దుర్తి జూనియర్ కాలేజీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

వెల్దుర్తి(కృష్ణగిరి): నీట్‌ను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా చేపట్టిన విద్యా సంస్థల బంద్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. వెల్దుర్తి టౌన్‌తో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను గురువారం ఏఐఎస్‌ఎఫ్ మండల నాయకులు శ్యామ్, సుధీర్‌నాయుడు ఆధ్వర్యంలో బంద్ చేయించారు. వారు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నీట్‌ను రద్దు చేయాలి

తుగ్గలి : నీట్‌ను రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శివ, రమేష్ డిమాండ్ చేశారు. పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ గురువారం మండలంలోని పాఠశాలలను మూసివేయించారు. జాతీయ స్థాయిలో కాకుండా రాష్ట్రాల వారీగా పాత పద్ధతిలో హెల్త్ యూనివర్శిటీల పర్యవేక్షణలో ప్రవేశ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. నీట్ ఫలితాలు విడుదలై 29 రోజులైనా కేంద్ర ప్రభుత్వం ఇంత వరకు ఎవరిపై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. నీట్ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.